క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



గుడ్లవల్లేరు: చినగొన్నూరు దళితవాడలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమి పూజ చేశారు. గురువారం చినగొన్నూరుతో పాటు పురిటిపాడు, కట్టవానిచెరువులో జరిగిన పల్లె పండగకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాము హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.లోకరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి ప్రత్యేక పూజలను గురువారం వేద పండితులు నిర్వహించారు. అనంతరం చండీ హోమాన్ని వేద మంత్రోచ్ఛరణ నడుమ చేపట్టారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఆకుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు తాగునీరు అందించండి



గుడివాడ టౌన్: టిడ్కో గృహాలలో కొన్ని ప్రాంతాలకు కనీస మంచినీటి సౌకర్యం లేదని తక్షణమే అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద తొలుత నిరసన ప్రదర్శన చేసి అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కాగా ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని, అందరికీ అందటంలేదని మహిళలు అన్నారు. వెంటనే కాలనీ కొరకు ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో నీటిని నింపే ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి. రజిని, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



గుడివాడ టౌన్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయ్ అన్నారు. గురువారం పట్టణంలోని స్కానింగ్ సెంటర్‌లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం పరిధిలో నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణకు పాల్పడితే చట్టాన్ని ఉల్లంఘిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపును సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రానికి సంబంధించి అనుమతులన్నీ కచ్చితంగా ఉండాలన్నారు. ప్రతి గర్భిణి వివరాలు ఫారం ఎఫ్‌లో పొందుపర్చాలన్నారు. ఆరోగ్యశాఖ విద్యా బోధకుడు బి. రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

వరద నష్టపరిహారం కోరుతూ ఆందోళన



నందివాడ: బుడమేరు వరదల్లో నష్టపోయిన మోటార్ ఇంజిన్లకు నష్టపరిహారం ఇవ్వాలని గురువారం రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పుట్టగుంట సచివాలయం వద్ద ఆందోళన చేసి సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. పుట్టగుంట పరిధిలో 35 మంది రైతులు మోటార్లు వరదల వల్ల నష్టపోయారని, ఒక్కొక్క మోటార్ రిపేర్ చేయించాలంటే సుమారు రూ. 12 వేలు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి పరిహారం ఇప్పించాలని కోరారు. రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి, స్థానికులు లచ్చిరెడ్డి ప్రసాదు, పరుచూరి కోటేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, తోట రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వంతెన చివర విరిగిపోయిన దృశ్యం



డ్రెయిన్ పైభాగంలో దెబ్బతిన్న వంతెన రెయిలింగ్

పోలరాజ్ డ్రెయిన్ అభివృద్ధి ఎప్పుడో?

- పూర్తిగా దెబ్బతిన్న ఖానాలు
- పాడైపోయిన వంతెన పైభాగం
- విరిగిపోయిన వంతెన అంచు

మండవల్లి: మండల పరిధిలోని ప్రత్తిపాడు–తక్కెళ్ళపాడు గ్రామాల మధ్య ఉన్న పోలరాజ్ డ్రెయిన్ పూర్తిగా దెబ్బతింది. 40ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి అధికారులు దీనికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో అది దారుణంగా దెబ్బతింది. వంతెన అడుగు భాగాన ఉన్న ఖానాలు పాడయ్యాయి. వంతెన పైభాగం కూడా దెబ్బతింది. ఒకవైపు వంతెన అంచు విరిగిపోయింది. ఈ డ్రెయిన్ నుంచి వచ్చే నీరు కొల్లేరులో కలుస్తుంది. ఇటీవల బుడమేరు తదితర డ్రెయిన్ల నుంచి వచ్చిన వరద నీటి కారణంగా



పోలరాజ్ డ్రెయిన్ ఖానాల పరిస్థితి

పోలరాజ్ డ్రెయిన్‌లోని నీరు దీని సమీప గ్రామాల్లోకి వచ్చాయి. ప్రత్తిపాడు, తక్కెళ్ళపాడు, నుచ్చుమిల్లి, కాకతీయనగర్, పులపర్రు గ్రామాల్లోకి వచ్చిన నీటి వల్ల ఆయా గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడి నానా అవస్థలు పడ్డారు. వంతెన సక్రమంగా లేకపోవడంతో డ్రెయిన్‌లోని నీరు చేపల చెరువుల్లోకి చేరి వాటి యజమానులకు నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రెయిన్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పించుకునే ధోరణిలో అధికారులు..

పోలరాజ్ డ్రెయిన్ సమస్యపై అధికారులను వివరణ కోరగా.. తప్పించుకునే ధోరణిలో సమాధానం చెబుతున్నారు. డ్రెయినేజీ ఏఈని వివరణ కోరగా.. ఇది తమ పరిధిలోనిది కాదని, జెడ్పీ ఏఈ దీనిపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. జెడ్పీ ఏఈని వివరణ కోరగా.. రోడ్డు అయితే మాదే.. డ్రెయిన్ మాత్రం మాకు సంబంధించినది కాదు అని చెప్పడం గమనార్హం.

డ్రెయిన్ పొంగితే నీళ్లన్నీ ఊళ్లోనే..



పోలరాజ్ డ్రెయిన్ అస్తవ్యస్తంగా ఉండటంతో అది పొంగినప్పుడు నీళ్లన్నీ ఊళ్లోనే ఉంటున్నాయి. ఇటీవల బుడమేరు తదితర డ్రెయిన్ల వల్ల వచ్చిన నీటి కారణంగా ఈ డ్రెయిన్ పొంగి మా గ్రామంలోని ఇళ్లు, రహదారులు కూడా నీట మునిగాయి. రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడింది. డ్రెయిన్‌ని బాగు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. – ఎల్.యేసుదాసు, తక్కెళ్లపాడు

డ్రెయిన్‌కి మరమ్మతులు చేపట్టాలి



పోలరాజ్ డ్రెయిన్‌ని 40 సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి దీని ఆలనా పాలనా చూసిన వారెవ్వరూ లేరు. ఈ కారణంగా డ్రెయిన్ సమీప గ్రామాలైన కాకతీయనగర్, పులపర్రు, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా డ్రెయిన్‌కి మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలి. – సీహెచ్ పేతురుబాబు, తక్కెళ్లపాడు

సొసైటీ పెట్రోల్ బంక్ ప్రారంభం



బంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అనగాని

గుడ్లవల్లేరు: కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్ర పెట్రోల్ బంక్‌ను గురువారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా ప్రారంభించారు. పీఏసీఎస్ నుంచి రూ.20లక్షలు, హెచ్‌పీసీఎల్ నుంచి రూ.50లక్షలతో ఈ బంకును నిర్మించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ, రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎం.ఎస్. గోపాలకృష్ణ మూర్తి, సబ్ రిజిస్ట్రార్ ఎస్.మధుబాబు, జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖరరావు, డివిజన్ సహకార అధికారి వి.వి.ఫణికుమార్, గుడివాడ ఆర్డీఓ బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ బి. లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పునఃప్రారంభం

కౌతవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగడ్ల రాము చేతుల మీదుగా గురువారం పునఃప్రారంభించారు. రూ.30లక్షల ప్రభుత్వ నిధులతో మరమ్మతులు చేయించారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



పార్టీనాయకులు కార్యకర్తలతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

పామర్రు(పెదపారుపూడి): వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, అందరికీ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. పెదపారుపూడి మండలం వానపాముల గ్రామంలో కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించాలన్నారు. పార్టీ ఆదేశానుసారం ప్రకటించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలలో తీసుకువెళ్లి ప్రజలను పార్టీ పట్ల చైతన్యం చేయాలని అన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాలలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తెలియజెప్పాలని అన్నారు. అంతే కాకుండా ఎన్నికలలో ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా తాత్సారం చేయడంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. అనంతరం గ్రామంలోని మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిసి డేవిడ్ రాజు మాతృమూర్తి పెద్ద ఖర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆ తర్వాత వానపాముల ఎంపీటీసీ జుఝవరపు వెంకటేశ్వరమ్మ మామ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ గోగం సురేష్, మండలపార్టీ అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాసాల వద్ద మందు షాపులు వద్దు



ధర్నా చేస్తున్న స్థానికులు

గుడివాడ టౌన్: మద్యం దుకాణాలను నివాసాలకు సమీపంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని బేతవోలు వంతెన వద్ద షాపు ఏర్పాటు చేస్తున్న సమయంలో స్థానికులు, మహిళలు అడ్డుకున్నారు. కేవలం అమ్మకాలు మాత్రమే కొనసాగిస్తామని, మద్యం తాగడానికి అనుమతించమని షాపు యజమాని చెబుతున్న మాటలు తాము నమ్మమన్నారు. షాపును తొలగించే వరకు ఉద్యమిస్తామని మహిళలు, స్థానికులు ధర్నాకు దిగారు. గుడివాడ–విజయవాడ రహదారిపై అడ్డుగా నిలబడి ట్రాఫిక్ నిలిపివేశారు. మద్యం షాపు ఏర్పాటును నిలుపుదల చెయ్యకపోతే తాము ఎక్కడికైనా వెళతామని మహిళలు హెచ్చరించారు. పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. విషయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి స్థానికులు తీసుకువెళ్లగా స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడతానని షాపు ఏర్పాటును నిలుపుదల చేస్తానని మంత్రి హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



గుడ్లవల్లేరులో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కొడాలి తదితరులు



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ కొడాలి సురేష్ చేతుల మీదుగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సారథి, మండల పరిషత్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బలరామ్, రాణి, గ్రామ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

మొవ్వలో వాల్మీకి జయంతి..

మొవ్వ: మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మస్తాన్, ఆర్‌ఐ విజయదుర్గ, మండల సర్వేర్ ఏ కిషోర్ బాబు, రీసర్వే డీటీ జగన్మోహన్‌రావుతో పాటు పాలు గ్రామాల వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. అలాగే మొవ్వ ఎంపీడీ కార్యాలయంలో ఎంపీడీవో కె. విమాదేవి ఆధ్వర్యంలోను మొవ్వ వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి అధ్వర్యంలోను జయంతి వేడుకలను నిర్వహించారు.

కావ్య సాహిత్యాన్ని అందించిన ఆది కవి వాల్మీకి

పామర్రు: మొట్టమొదటిగా కావ్య సాహిత్యాన్ని అందించిన ఆదికవి మన భారతీయ కవి వాల్మీకి కావడం మనందరికీ గర్వ కారణమని పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక టీఎస్‌ఆర్‌అండ్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం హెడ్ డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి సాహిత్యాన్ని విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. డాక్టరు శేషుకుమార్, హిస్టరీ అధ్యాపకురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



కలిదిండి గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కలిదిండి గ్రంథాలయంలో..

కలిదిండి(కై కలూరు): మహర్షి వాల్మీకి జయంతిని కలిదిండి గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ 24 వేల శ్లోకాలు, 7 కాండాలతో రామాయణ మహా కావ్యాన్ని ఆయన రచించారని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మోపర్రు(పెదపారుపూడి): మండలంలో మోపర్రు గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ ఆలయ 9వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవార్లకి గుడి వద్ద మహిళలు పొంగళ్లు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బోయిన శివయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 4వేల మందికి అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార రాజా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సాహితీ కళాజాతరకు ఆహ్వానం

కై కలూరు: ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర పేరుతో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో కవితా గానం, వివిధ సాహిత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కైకలూరు ప్రభుత్వ ఓరియంటల్ స్కూల్ ఉపాధ్యాయుడు, సహజ కవి దండే బెనర్జీ, పల్లెవాడ ప్రభుత్వ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత దివ్వెల వెంకట నరసయ్యలకు ఆహ్వానం అందింది.

పనుల పరిశీలన

కై కలూరు: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో భాగంగా కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణాలను ఎంఈవో–2 వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పథకంలో భాగంగా కేంద్రం నుంచి కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి రూ.5 లక్షలు, పార్కు ఏర్పాటుకు రూ.లక్ష నిధులు మంజూరయ్యాయన్నారు. వాటితో పనులు జరుగుతున్నాయని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

మండవల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో సకాలంలో సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, నలుగురు వీఆర్వోలు, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ అయిన పోస్టులకు వీలైనంత త్వరగా అధికారులను నియమించి ప్రజలకు సకాలంలో సేవలు అందే విధంగా చూడాలని వారు డిమాండ్ చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐటీఐలలో మిగిలిన సీట్లకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ గురువారం తెలిపారు. స్థానిక ఐటీఐలో డీజిల్ మెకానికల్ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసి ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు.

జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి సూచించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాలలో చెస్, యోగా టీంల ఎంపిక గురువారం జరిగింది. ఎంపికైన విద్యార్థులు నేడు నున్నలో జరిగే ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఫణి రాజమోహన్ తెలిపారు. నియోజకవర్గ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఇన్‌చార్జి జవహర్‌బాబు, పీడీలు లక్ష్మణరావు, బాలస్వామి, మాసిల్‌మని, పాల్, రవీంద్రబాబు, నందకిషోర్, గ్లాడిసన్, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు అసీసీ విద్యార్థులు

పామర్రు: జిల్లా స్థాయిలో త్వరలో జరిగే చెస్ పోటీలలో తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని అసీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్ పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో విజేతలైన ఏ లక్షిత, వి. అరవింద్ విక్టర్, వి. నాగ భరణి కుమార్‌లను గురువారం అభినందించారు. కరెస్పాండెంట్ సిస్టర్ రోజ్ థామస్, పీడీ మట్టా గ్లాడిసన్‌లను అభినందించారు.

జిల్లా జట్టుకు పెదముత్తేవి విద్యార్థులు..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెదముత్తేవి ఎస్ఎల్ఎస్‌వీవీఎస్ ఓరియంటల్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు గురువారం తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పామర్రు నియోజకవర్గ చెస్ పోటీల్లో సత్తా చాటి జిల్లా జట్టుకి ఎంపికయ్యారు. పి. హెలీనా మణిమంజరి, ఏ సౌభాగ్య రాజ్యలక్ష్మి, జిల్లా జట్టుకి ఎంపికవ్వగా టి. శ్రీరంగనాథ్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులు పాఠశాల విద్యాకుటుంబం అభినందనలు తెలిపారు.

సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి(కై కలూరు): కలిదిండి మండలంలోని పెదలంక, కోట కలిదిండి గ్రామాల్లో సిమెంటు రోడ్ల పనులకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని ఉనికిలి, మొఖాసా కలవపూడి గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కూటమి నేతలు సీహెచ్ దుర్గాప్రసాద్, ఎం.సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

మండవల్లి: ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి సూచించారు. గురువారం సాయంత్రం మండవల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రీసర్వే, సివిల్ సప్లయీస్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు తహసీల్దార్ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పేరూరు, దాకరం, మాదవరం గ్రామాల్లో మండల స్థాయి టీం ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ఈ సభల్లో తహసీల్దార్ సుభాని పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ నెల 25 వరకు సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. 18న గురజ, పెనుమల్లి, సంఘర్షణపురం, 19న పెదకామనపూడి, చిగురుకోట, వడాలి, 21న కోమర్రు, ముదినేపల్లి, బొమ్మినంపాడు, 22న గోకినంపాడు, సింగరాయపాలెం, దేవరం, 23న ములకలపల్లి, అల్లూరు, ఈడేపల్లి, 24న కొరగుంటపాలెం, దేవపూడి, ప్రొద్దువాక, 25న ఊటుకూరు, వాడవల్లి, కాకరవాడ గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని చెప్పారు.

కైకలూరులో నేటి నుంచి..

కైకలూరు: గ్రామాల్లో రీసర్వేపై రెవెన్యూ అధికారుల గ్రామసభలు ఈ నెల 18 నుంచి నవంబరు 12 వరకు జరుగుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం గురువారం చెప్పారు. జాయింట్ ఎల్‌పీఎంఎస్, మ్యూటేషన్, విస్తరణ వంటి భూ సంబంధిత సమస్యలను గ్రామసభల్లో అర్జీల రూపంలో ఇవ్వవచ్చన్నారు. అర్జీ అందించిన 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామసభలకు తహసీల్దార్, రీసర్వే డెప్యూటీ తహసీల్దార్, మండల లెవల్ సర్వే ఆఫీసర్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్ సభ్యులుగా ఉంటారన్నారు. ముందుగానే గ్రామ సభలపై టాం టాం వేయించాలని చెప్పారు.

ఆధ్యాత్మిక భావన నింపిన వేద సభ



కైకలూరు శ్యామలాంబ దేవాలయంలో వేదసభలో ఘనాపాఠీలు, క్రమాపాఠీలు

కై కలూరు: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు శ్యామలాంబ దేవాలయం వద్ద గురువారం జరిగిన 58వ వేద సభ ఆధ్యాత్మిక భావన నింపింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఘనాపాఠీలు 10 మంది, క్రమాపాఠీలు 38 మంది, స్వర్ణలు 37 మంది, స్థానిక పురోహితులు 15 మంది వేదసభలో పాల్గొన్నారు. ప్రముఖ ఘనాపాఠీ గుళ్లపల్లి శివశర్మ ఆధ్వర్యంలో వేదపారాయణం, వేద ఆశీర్వాదం నిర్వహించారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ అందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.